వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అమ్మవారి విశ్వరూప దర్శనం, చెంప నరుకుడు ఘట్టాలతో తిరుపతి గంగ జాతర పరి సమాప్తం అయ్యింది. బుధవారం తెల్లవారు జామున 1.30గంటలకు అమ్మవారి విశ్వరూప దర్శనంతో పాటు చెంపను నరకడం జరిగింది. వారం రోజులపాటు కనీవినీ ఎరుగని రీతిలో జాతర జరిగింది. వేడుక.. సారెలు సమర్పించి, వివిధ వేషధారణలతో ఆలయానికి విచ్చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న భక్తులు... తిరుపతి ప్రజలు, గంగమ్మ భక్తుల సహకారంతో పాటు అందరి సమిష్టి కషి వల్లే గంగ జాతర ఇంత గొప్ప విజయాన్ని సాధించిందన్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. మరో ఐదు వారాల పాటు భక్తులను గంగమ్మ ఆలయం వద్ద మారు పొంగళ్ళు పెట్టి, మొక్కులు తీర్చుకోనున్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డు రాకతో

దోభి ఘాట్ కబ్జా

- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం - అవస్థలు పడుతున్న రజకులు

వైసిపి నేతలు కబ్జాకు యత్నిస్తున్న దోభీ ఘాట్ స్థలం

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేయడంతో వైసిపి నేతల భూకబ్జాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వం స్థలాలు, డికేటీ భూములు, చెరువులు, సమస్యలో ఉన్న భూములు కబ్జాచేసి అమ్ముకుంటున్నారు. దీంతో వైసిపి నేతల రియల్‌ఎస్టేట్ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

మాస్టర్‌ప్లాన్ రోడ్డు వైసిపికి బంగారు బాతుగుడ్డుగా మారింది. తాజాగా తిరుచానూరులోని పద్మావతిపురం పంచాయతీ సర్వేనెంబర్ 234లో గత కొన్ని సంవత్సరాలుగా రజకులు దోభిఘాట్‌ను ఉపయోగించుకోని జీవిస్తున్నారు. అక్కడే బట్టలు ఉతికి, అక్కడే ఆరవేసేవారు. గత నెలలో తిరుపతి ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి స్వామిజి చేత మాస్టర్‌ప్లాన్ రోడ్డు ప్రారంభించారు. ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్డు పద్మావతిపుర పంచాయతీకి అనుకొని ఉంటుంది. వైసిపి నేతలు ఎంఎల్‌ఏ సహకారంతో సుమారు 2 ఎకరాలు కలిగిని దోభిఘాట్‌ను కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు చర్యలు చేపట్టారు. దీని విలువ సుమారు రూ.4కోట్లు ఉంటుందని బాధితులు అంటున్నారు. పద్మావతిపురం పంచాయతీలో సెంటు భూమి దొరకడమే మహాకష్టం. ఇక్కడ భూములు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దోభిఘాట్ స్థలం ఆక్రమించుకున్న రెవెన్యూ యంత్రాంగం తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. దోభిఘాట్‌ను నమ్ముకోని చాలామంది రజకులు ఇదే జీవనోపాధిగా జీవిస్తున్నారు. రజకులు వైసిపి నేతలకు ఎంత చెప్పినా వారు ఆ స్థలం దోభిఘాట్‌కు ఇవ్వకుండా వారి వ్యాపారాల కోసం ఆక్రమించుకోవడంతో తమ గోడు ఎవరికి చెపుకోవాలో అర్థం కాక నానా అవస్థలు పడుతున్నారు. గతంలో యోగిమల్లవరం చెరువును వైసిపి నేతలు కబ్జా చేస్తే దాని సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న పోరాటాలు చేసి చెరుకు కబ్జాకు గురికాకుండా చేయడం జరిగింది. ఇప్పుడు పద్మావతిపురం పంచాయతీపరిధిలో ఉన్న దోభిఘాట్‌ను వైసిపి నేతలు వదలేదు. దోబిఘాట్ స్థలం కాపాడాలని లేదంటే ఆందోళన కార్యక్రమం ఉధృత్తం చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర, తిరుచానూరు సిపిఎం మాజీ ఎంపిటిసి సుమన్ హెచ్చరించారు.

బిజెపి పాలనకు అంతం ప్రారంభమైంది

కర్ణాటక ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనం
జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తిరుపతి: దేశంలో బిజెపి పాలనకు అంతం ప్రారంభమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. కర్ణాటక రాష్ట్రం ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. తిరుపతిలోని ఎంబి భవన్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నియంతత్వ విధానాలకు బిజెపి నిరంకుశ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. పెట్టుబడిదారులకు మాత్రమే మోడీ ప్రభుత్వంలో మేలు జరిగింది తప్ప మామూలు ప్రజలకు ఒరిగిందేమీలేదని అన్నారు. దేశప్రజలపై ఆర్థికదాడి జరుగుతోందని కోట్ల మందికి బతకుదెరువు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై మోడీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విరుచుకుపడ్డారు. రానున్న రోజుల్లో ఐక్యఉద్యమాలని బలోపేతం చేసి కేంద్రంపై పోరాటాన్ని ఉధతం చేస్తామని స్పష్టం చేశారు. కేరళ ఫైల్స్ పేరుతో వచ్చిన చిత్రంలో వాస్తవాలు లేవని, నిజంగా అది వాస్తవం అయితే 30వేల మంది యువతులు కేంద్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు తెలియకుండా ఎలా విదేశాలకు వెళ్ళగలరని ప్రశ్నించారు. మోడీ హయాంలో గుజరాత్‌లో ఎన్ని ఘోరాలు జరిగాయో అందరికీ తెలుసునన్నారు. వాస్తవాలను వక్రీకరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు విసుగు చెందారని, నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతోందని వాపోయారు. ప్రజలు పోరాటాల్లోకి వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆ దిశగా ప్రజల్ని చైతన్యవంతులను చేయాల్సి ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈసమావేశానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, తిరుపతి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, జనార్ధన్, నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తిరుమలలో వేసవి రద్దీ

- నిండిన వైకుంఠం కాంప్లెక్స్
- క్యూలలో భక్తుల పడిగాపులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. బయట క్యూలైన్ కష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకూ విస్తరించి ఉంది. అత్యధిక మంది భక్తులు రావడంతో టీటీడీ తగిన చర్యలు తీసుకుంది. అన్నప్రసాదాలను క్యూలైన్‌లోనే పంపిణీ చేయాలని నిర్ణయించింది. నడకదారిన వచ్చిన భక్తులకు శ్రీవారి దర్శనం ఐదు గంటల సమయం పైగానే పడుతుందని టిటిడి అధికారులు తెలిపారు. అలాగే ఉదయం ఏడు గంటలకు టోకెన్లు లేకుండా సర్వదర్శనం క్యూలైన్‌లో ప్రవేశించే భక్తులకు మాత్రం 24గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ఈ నెల మొత్తం తిరుమలలో భక్తుల రద్దీ ఇలాగే ఉంటుందని చెబుతున్నారు. వేసవి సెలవులు పూర్తయ్యేంత వరకూ భక్తుల రద్దీ ఆగదని, ప్రజలు చూసుకుని తిరుమలకు రావాలని టీటీడీ అధికారులు కోరుతున్నారు. రూ.300ల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని 77,436 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 38,980 మంది భక్తులు తలనీలాలను సమర్పించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారని టీటీడీ అధికారులు వెల్లడించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు.

శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల షెడ్యూల్ విడుదల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను బుక్ చేసుకునే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టిటిడి షెడ్యూల్ విడుదల చేసింది. సేవా టికెట్లు లేదా దర్శన టికెట్ల విడుదల తేదీ ఆదివారం వచ్చినట్లయితే వాటిని మరుసటి రోజు విడుదల చేస్తారు. ప్రతినెలా 18 నుంచి 20వ తేదీ వరకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల లక్కీడిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు డిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవలతోపాటు వర్చువల్ సేవాటికెట్లను 21వ తేదీన విడుదల చేస్తారు. శ్రీవాణి, అంగ ప్రదక్షిణం, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్లు 23వ తేదీన విడుదలవుతాయి. రూ.300ల దర్శన టికెట్ల కోటాను 24న, తిరుపతిలో గదుల కోటాను 25న, తిరుమలలో గదుల కోటాను 26న విడుదల చేయడం జరుగుతుంది. భక్తులు గమనించి సేవా టికెట్లు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి కోరుతుంది.

శుద్ధ.. సుందర.. తిరుమల విజయవంతం

అధికారులు, ఉద్యోగులకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందన

ప్రజాశక్తి- తిరుపతి సిటి: తిరుమలను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చేందుకు నిర్వహించిన శుద్ధ తిరుమల.. సుందర తిరుమల కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు, ఉద్యోగులు, ఇతర విభాగాల సిబ్బంది విజయవంతం చేశారని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విభాగాల్లో పనిచేసేవారు, ఇతరులు స్వచ్ఛందంగా ఈకార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ముందుకు వస్తే వారి సేవలు వినియోగించుకోవాలని ఆరోగ్యాధికారికి సూచించారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గహంలో బుధవారం ఈవో సీనియర్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలతో పాటు నడకదారుల్లోని దుకాణదారులకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. టాక్సీ, ప్రైవేట్ వాహనాలు , ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు వెళ్ళే భక్తులకు ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించడానికి పోలీస్, ఆర్టీసీ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. తిరుమలతో పాటు ఘాట్ రోడ్లు, నడకదారుల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకుండా భక్తులకు అవగాహన కల్పించేలా దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. విరివిగా చెత్తబుట్టలు ఏర్పాటు చేసి వ్యర్థ పదార్థాలను అందులోనే వేసేలా అవగాహన కల్పించాలన్నారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణం వేగం పెంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమయ్యే యంత్ర పరికరాల సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల గుండె చికిత్సల ఆసుపత్రిలో రోగులు, సిబ్బంది, డాక్టర్లకు సౌకర్యవంతంగా ఉండేలా కేఫ్టేరియా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేద విశ్వవిద్యాలయంలో కొత్తగా ధ్యాన మందిరం నిర్మించి అక్కడ క్రియ యోగ శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక జీవన విధానంపై వేదవిజ్ఞానం ప్రాముఖ్యతపై ఎస్వీ బీసీ కార్యక్రమాలు రూపొందించాలని ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అడవుల్లో అకేషియా చెట్ల తొలగింపు పై సమీక్షించారు. జేఈవో సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీ బీసీ సీఈవో షణ్ముక్ కుమార్, లా ఆఫీసర్ వీర్రాజు, ఎఫ్ఏసిఎఓ బాలాజీ, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: సచివాలయ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి నగర పరిధిలోని 32, 33, 34 సచివాలయాలను కమిషనర్ హరిత బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తూ సచివాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. ప్రజల సమస్యలు మీ పరిధిలో పరిష్కారం కానప్పుడు కార్పొరేషన్ కార్యాలయానికి పంపించాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేకశ్రద్ధ నిర్వహించాలని చెబుతూ యూజర్ ఛార్జీలు క్రమం తప్పకుండా సకాలంలో వసూళ్ళు చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలనే విషయాన్ని ప్రజలకి అవగాహన కల్పించాలని, శానిటేషన్ మెరుగుపరిచేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. హాజరు పట్టికను పరిశీలిస్తూ అనుమతి లేకుండా సచివాలయ సిబ్బంది లీవు పెట్టరాదని, అదేవిధంగా సచివాలయ సిబ్బంది యూనిఫామ్ ను కచ్చితంగా ధరించాలని, సచివాలయాల్లోని సిబ్బంది ప్రజలకి నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

31 నుండి అప్పలాయగుంట

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- తిరుపతిసిటి: అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టిటిడి పిఆర్‌ఓ డాక్టరు టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మే23వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మే 30వ తేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. 31న పెద్దశేష వాహనం, జూన్1న చిన్నశేష, హంస వాహనం, 2న సింహ, ముత్యపుపందిరి వాహనం, 3న కల్పవృక్ష, కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం, 4న మోహినీ అవతారం, గరుడసేవ, 5న హనుమంత, గజవాహనం, 6న సూరప్రభ, చంద్రప్రభ వాహనం, 7న రథోత్సవం, అశ్వవాహనం, 8న చక్రస్నానం, ధ్వజావరోహణం జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయని వెల్లడించారు.

'ఉపాధి' లక్ష్యాలను అందిపుచ్చుకోవాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులు ఎంపిడిఓలు, సహాయ పథక సంచాలకులు, సహాయ ప్రాజెక్టు అధికారులు, ఈసీలతో జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కూలీల హాజరు శాతం పెరగాలని, హార్టికల్చర్ అభివద్ధిపై దష్టి పెట్టాలని, వర్షాకాలం లోపు ఉపాధి పనులు వేగంగా జరిగేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పనులలో కూలీల హాజరు శాతం పెంచాలని, పని దినాలు పెరగాలని అన్నారు. వచ్చే వారంలోపు ఉపాధి హామీ కూలీల హాజరు 1,25,000 దాటేలా ఎంపిడిఓలు పురోగతి సాధించేలా, గ్రామ పంచాయతీల వారీగా ఫీల్డ్‌అసిస్టెంట్లు, సంబంధిత ఏపీఓ తదితర అధికారులతో సమీక్షించుకుని ప్రణాళికా బద్ధంగా పనిచేసి పురోగతి సాధించాలన్నారు. హౌసింగ్ నిర్మాణం, హార్టికల్చర్ పనులపై దష్టిపెట్టి ప్రతి మండలంలోని అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. ఈ సెప్టెంబర్ వరకు మనకు ప్రతి మండలం వారికి కేటాయించిన లక్ష్యాలను తప్పకుండా సాధించాలన్నారు. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు కూడా నిబంధనల మేరకు కవర్ అయ్యేలా గ్రామ పంచాయతీలవారీగా గుర్తించి వారికి పనులు కల్పించి పని దినాలు మెరుగ్గా ఉండేలా చేయాలన్నారు. దొరవారిసత్రం, కోట ఓజిలి, నాగలాపురం, తడ, నారాయణవనం మండలాల పేద ఎస్సీ, ఎస్టీ పేద కూలీలకు ఎక్కువ మందికి పనికల్పించాలని అన్నారు. హార్టికల్చర్ ఈ సంవత్సరం 2023 నుంచి 24కు గాను 5500 ఎకరాల లక్ష్యానికి గాను 1100ఎకరాలు సాధించారని, మిగిలినది పూర్తి చేయడానికి ప్రతి మండలంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా మండలంలో తాసిల్దారు, ఉద్యానవన అధికారి, వ్యవసాయ అధికారి, ఎస్‌హెచ్ఓ, ఈఓ, పిఆర్డీ తదితర మండల అధికారులు ఉంటారని వీరు సమన్వయంతో పనిచేసి మండలాలకు 100 ఎకరాలకు తక్కువ కాకుండా ఉద్యానవన పంటలను, ఫ్లోరీ కల్చర్‌ను ప్రోత్సహించి ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ తదితర వర్గాలకు చెందిన అర్హులైన అందరికీ లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా యంత్రాంగం ఉద్యాన పంటలు వేసుకునే వారికి త్వరిత గతిన ఏపీ ఎంఐపి ద్వారా డ్రిప్ మంజూరు చేయడం జరుగుతుందని, రైతులను ఇందుకు ప్రోత్సహించాలని, ఆగస్టు లోపు గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం జరగాలని అన్నారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గట్ల వెంబడి రైతుల పొలంలో కొంత మేరకు పూలమొక్కల పంట, ఉద్యాన పంటలు వేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. కమ్యూనిటీ భూములు, పోరంబోకు స్థలాల్లో తహశీల్దార్లు, ఈఓపిఆర్డి, డియల్డిఓలు బాధ్యులుగా సమన్వయంతో కమ్యూనిటీ ప్లాంటేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

జిల్లాలో ప్రస్తుతం సరాసరి కూలీ రూ.260లు ఉందని, కానీ ఉండాల్సిన సరాసరి కూలీ రూ.272లనీ, దీనిని అందిపుచ్చుకుని సరాసరి కూలీ పెరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సంబంధిత మండలం ఏపిఓ బాధ్యులుగా దీనిని గ్రామ పంచాయతీ వారీగా సమీక్షించి సమయానుసారంగా ఎంపిడిఓ దష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే సమయంలో ఉపాధి హామీ కూలీ చెల్లింపులు సకాలంలో జరగాలని, నిబంధనల మేరకు సరాసరి వేతనం అందేలా చర్యలు ఉండాలని సూచించారు. జాబ్‌కార్డులు, ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలన్నారు. వాలంటీర్లు ప్రజలకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా నియోజకవర్గాల వారీగా సేవ మిత్ర, సేవ రత్న, సేవ వజ్రగా వారిని సత్కరించే కార్యక్రమం షెడ్యూల్‌ను స్థానిక ఎమ్మెల్యే వారి సమయం తీసుకుని రోజుకు రెండు సచివాలయాలకు తగ్గకుండా నిర్వహించేందుకు ప్రణాళికలు తయారుచేసి పంపాలని ఆదేశించారు. ఫేజ్2 లో నియామకమైన సచివాలయ సిబ్బందికి పెండింగ్ ప్రొబేషన్ డిక్లరేషన్‌కు చర్యలు చేపట్టాలని, యాంటిసిడెన్స్ వెరిఫికేషన్‌కు ఎస్పీకి ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసమావేశంలో డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్, సిపిఓ అశోక్ కుమార్, డిఎల్‌డిఓ సుశీలదేవి, ఆదిశేషరెడ్డి, ఎంపీడీఓలు, ఏపీఓ ఏపీడిలు పాల్గొన్నారు.

జగనన్న భూహక్కు - భూరక్ష

పనులు వేగవంతం చేయండి: కమిషనర్

జగనన్న భూ సర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్న కమిషనర్ హరిత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వే పనులను వేగవంతం చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీసర్వే పనులపై మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ హరిత మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వే పనులు పూర్తి చేసేందుకు నగరపాలక రెవెన్యూ, ప్లానింగ్ సిబ్బందితోబాటు, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది అంతా కలిసి సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే డ్రోన్ ద్వారా మ్యాపింగ్ చేసి సర్వే పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ డ్రోన్‌సర్వే ఫలితాలు పూర్తి అయ్యి మనకి అందేలోపు మిగిలిన పనులను పూర్తిచేసి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఏరియాలో వున్నటువంటి సర్వే నంబర్లు, ఆ సర్వే నంబర్లలో వున్న భవనాల విస్తీర్ణం, ఆ భవనాల యజమానుల గుర్తింపు పకడ్బందిగా సిద్ధం చేయాలన్నారు. ఎక్కడా తప్పులు లేకుండా పారదర్శకమైన రికార్డులు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఒక సచివాలయం నుండి మరొక సచివాలయానికి ఇళ్ళు మ్యాపింగ్ జరిగి ఉంటే సరిదిద్దుకోవాలని అన్నారు. ఈ సర్వే పూర్తి అయిన తరువాత అర్బన్ పరిధిలోని అందరికీ కూడా కొత్త భూహక్కు పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటీవల శెట్టిపల్లి పంచాయతీ నుంచి నగరపాలక సంస్థలోకి వీలినమైన ప్రాంతాల్లో ప్రత్యేక అభివద్ధి చేపట్టెందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ మాట్లాడారు. అక్కడ పనుల నిర్వహణకు, పారిశుధ్యం నిర్వహణకు అందరి అధికారులకు భాధ్యతలు అప్పగించి ప్రత్యేకదష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, రెవెన్యూ అధికారులు కెఎల్.వర్మ, సేతుమాధవ్, ఏసీపీ బాలసుబ్రమణ్యం, అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రయ్య, టీపీఓలు, ఆర్ఐలు ఉన్నారు.

నేటి నుంచి నగరంలో ట్రాఫిక్ మళ్లింపు: ఎస్‌పి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: శ్రీనివాస సేతు బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో రిలయన్స్ మార్ట్ ప్రాంతంలో పూర్తిగా వాహనాల దారి మళ్లింపు చేశామని, తిరుపతి నగర ప్రజలు, వాహనదారులు, యాత్రికులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీనివాస సేతు పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న రిలయన్స్ మార్ట్ వద్ద గురువారం నుంచి చురుకుగా జరుగుతాయన్నారు. ఇప్పటి వరకు ఈ దారి గుండా ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గాల ద్వారా వెళ్లాలన్నారు. ప్రజలు, వాహనదారులు సహకరించి నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్దేశించిన మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

తిరుపతికి వచ్చే వాహనాల దారిమళ్ళింపు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలో నిర్మిస్తున్న శ్రీనివాస సేతు బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పటికే మూడు విభాగాల పనులు పూర్తి అయ్యి వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ముఖ్యమైన నాల్గవ భాగములో రిలయన్స్ మార్టు ముందున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మూడు విభాగాల పిల్లర్స్ అసంపూర్తిగా ఉన్నాయి, ఈ నిర్మాణ పనులను ఈనెల 18వ తేదీ ఉదయం నుండి మొదలుపెట్టి, ఒకనెల లోపల పూర్తిచేసేందుకు యాజమాన్యం నిర్ణయించిందని అన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నగరంలోకి వచ్చే భారీ వాహనాలు, ఇతర వాహనాలు దారి మళ్లింపు చేస్తున్నామన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

1. పీలేరు, మదనపల్లి వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు దారి మళ్లింపు. యథావిధిగా శ్రీనివాస మంగాపురం వైపు నుండి వచ్చు వాహనాలు, చెర్లోపల్లి క్రాస్, జూపార్క్, అలిపిరి, కపిలతీర్థం.. ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పై నుంచి ఆర్‌టిసి బస్టాండ్‌కు.
2. చిత్తూరు, బెంగళూరు వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు దారి మళ్లింపు.

చంద్రగిరి పట్టణ శివార్లలో యున్న నూర్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న సర్వీస్ రోడ్డు ద్వారా చంద్రగిరి, చెర్లోపల్లి క్రాస్, జూపార్క్, అలిపిరి, కపిలతీర్థం నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జ, ఆర్‌టిసి బస్టాండ్.

3. కడప వైపు నుండి తిరుపతికి వచ్చు వాహనాలు దారి మళ్లింపు. యథావిధిగా కట్టపుట్టాలమ్మ గుడి వద్ద యుటర్న్ చేసుకున కరకంబాడీ అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా రమి గెస్ట్‌లైన్ హోటల్ వద్ద కొత్తగా నిర్మించిన చింతలచేను రోడ్డు ద్వారా ఆర్‌టిసి బస్టాండ్.
4. శ్రీకాళహస్తి వైపు నుండి తిరుపతికి వచ్చే వాహనాలు దారి మళ్లింపు. రేణిగుంట రమణ విలాస్ కూడలి, కరకంబాడీ రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా రమి గెస్ట్ లైన్ హోటల్ వద్ద కొత్తగా నిర్మించిన చింతల చేను రోడ్ ద్వారా ఆర్‌టిసి బస్టాండ్.
5. చెన్నై నుండి తిరుపతికి వచ్చే వాహనాలు దారి మళ్లింపు..

గాజులమండ్యం జంక్షన్ వద్ద నుండి రమణ విలాస్ కూడలి, కరకంబాడి రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా రమి గెస్ట్ లైన్ హోటల్ వద్ద కొత్తగా నిర్మించిన చింతల చేను రోడ్ ద్వారా ఆర్‌టిసి బస్టాండ్.

6. తిరుచానూరు వైపు నుండి తిరుపతికి వచ్చు వాహనాలు

మామిడికాయల మార్కెట్ 'వై' జంక్షన్ నుండి లక్ష్మీపురం జంక్షన్, రామానుజ సర్కిల్ వద్ద కుడివైపుగా వెళ్ళి హీరో హోండా షోరూమ్ ఎదురుగానున్న రైల్వేగేట్ దాటుకొని... కొత్తగా నిర్మించిన చింతల చేను రోడ్డు ద్వారా ఆర్‌టిసి బస్టాండ్.

7. వెదురుకుప్పం, పచ్చికాపలం వైపు నుండి తిరుపతికి వచ్చు వాహనాలు. యథావిధిగా అటువైపు నుండి తిరుపతికి వచ్చే, వెళ్ళు వాహనాలు అన్నమయ్య సర్కిల్ వరకు అనుమతించబడును. ఆర్‌టిసి బస్టాండ్ వైపుకు అనుమతించబడవు.
8. తిరుపతి ఆర్‌టిసి బస్‌స్టాండ్ నుండి వివిధ ప్రాంతాలకు వెళ్ళు వాహనాల దారి మళ్లింపు వివరాలు. తిరుపతి ఆర్‌టిసి బస్‌స్టాండ్ నుండి శ్రీకాళహస్తి, చెన్నై, కడప వైపు వెళ్ళు వాహనాలు పూర్తిగా లీలామహల్ జంక్షన్ మీదుగా కరకంబాడికి వెళ్ళి అండర్ బ్రిడ్జ్ వద్ద ఎడమ వైపుగా ఉన్న రైల్వే గేట్ మీదుగా వెళ్లాలి.
9. మదనపల్లి, చిత్తూరు, బెంగళూరు వెళ్ళు వాహనాలు ఆర్‌టిసి బస్ స్టాండ్ నుండి బయులుదేరి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ మీదుగ కపిలతీర్థం, అలిపిరి, జూపార్క్ మీదుగ చెర్లోపల్లి క్రాస్ వైపు వెళ్లాలి.
10. తిరుచానూరు వైపు వెళ్ళు వాహనాలు కొత్తగా నిర్మించిన చింతలచేను రోడ్డు ద్వారా రైల్వే గేట్ దాటి రామానుజ సర్కిల్, లక్ష్మీపురం జంక్షన్ మీదుగ వెళ్లవలసి ఉంటుందన్నారు తిరుపతి నగర ప్రజలు, వాహనదారులు, యాత్రికులు పై మళ్ళింపు ప్రాంతాలు, దారులను గుర్తించి వెళ్ళవలసి ఉన్నది. ఇది గమనించి వాహనదారులు సహకరించి నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఎస్‌పి కోరారు.

శ్రీనివాస సేతు

చదువు రాదని మోసం చేశారు

- అప్పు కట్టినా నగదు జప్తు
- కెనరా బ్యాంకు నిర్వాకంపై మహిళ ఆవేదన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బ్యాంకింగ్ రంగ సంస్థలు ఎంతో పారదర్శకంగా ఉంటాయన్నది ప్రజల నమ్మకం..అక్కడ మోసాలు జరగవని, మనం దాచుకునే డబ్బుకు, తీసుకునే రుణాలకు భద్రత ఉంటుందనే ప్రగాఢ విశ్వాసం..అందుకే తాము చెమటోడ్చిన సొమ్మును అక్కడ దాచుకుంటుంటారు..తీసుకున్న రుణాలను సకాలంలో తీర్చేస్తుంటారు. అయితే చేతివాటం ప్రదర్శించే కొందరు సిబ్బంది వల్ల బ్యాంకుల ప్రతిష్ట దెబ్బతింటోంది. చదువురాని వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనే శ్రీకాళహస్తి కెనరా బ్యాంకులో చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన దాసరి మునెమ్మ ఖాతానంబర్-5061101001685 తో కెనరా బ్యాంకులో ఆర్థిక లావాదేవీలు నడుపుతోంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం బంగారుపై రుణం తీసుకుని తీర్చేస్తూ వస్తోంది. అలా 2020 నవంబరు 8న రూ.30 వేలు, 2021 నవంబరు 15న రూ.45 వేలు రుణం తీసుకుని తీర్చేసింది. చివరగా తీసుకున్న రుణాన్ని నిర్ణీత గడువు 2022 నవంబర్ 14లోపే కట్టేయడంతో తిరిగి ఆమెకు అదే నెల 23వ తేదీ బ్యాంకు అధికారులు కొత్త రుణాన్ని మంజూరు చేస్తూ రూ.49 వేలు ఆమె ఖాతాలో జమ చేశారు. అయితే అప్పటికే ఆమె ఖాతాలో కుమార్తె పెళ్లికోసం దాచుకున్న రూ.50 వేలతో కలిపి మొత్తం లక్ష వరకు నగదు నిల్వ ఉంది. అందులోంచి 2023 ఫిబ్రవరి 8న ఆమె రూ.48 వేలు డ్రా చేసింది.2023 ఏప్రిల్ 10న కుమార్తె పెళ్లి కోసం మరో రూ.1.60 లక్షలు తన ఖాతాలో జమ చేసింది. ఈ క్రమంలో ఆమె ఖాతాలో మొత్తం రూ.2.20 లక్షల నగదు ఉండగా, బ్యాంకు అధికారులు అదేరోజు రూ.51,489 కట్ చేశారు. ఆ తర్వాత ఆమె అదే నెల 17న తన నగదును తనిఖీ చేయగా ఖాతాలో రూ.1.71 వేలు మాత్రమే ఉండటంతో కంగుతింది. ఇదేంటని బ్యాంకు అధికారులను ప్రశ్నించగా ముందు తీసుకున్న గోల్డ్ లోను తీర్చలేదని, అందుకే ఫీల్డ్ ఆఫీసర్ ఖాతా నుంచి రుణ మొత్తాన్ని పట్టుకున్నట్లు వివరించారు. తాను నిర్ణీత గడువుకు ముందే పాత రుణాన్ని తీర్చేశానని, తర్వాతే నాకు కొత్త రుణం ఇచ్చారని మునెమ్మ ఎంత మొత్తుకున్నా బ్యాంకు అధికారులకు పట్టకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే పాత రుణం తీరకుండా కొత్త రుణం ఎలా ఇస్తారనేది ఇక్కడ లాజిక్. తాను చదువుకోలేదని బ్యాంకు అధికారులు అప్పు కట్టేసినా తన ఖాతా నుంచి తనకు తెలియకుండా నగదు కట్ చేశారంటూ మునెమ్మ బ్యాంకు ఎదుట వాపోయింది. సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలంటూ ప్రాధేయపడుతోంది.

రుణం కట్టినట్టు ఆధారాలు ఏమీ లేవు

మునెమ్మ తమ బ్యాంకులో తీసుకున్న రెండో కంతు రుణం తీర్చినట్లుగా ఆధారాలు ఏమీ లేవు. రుణం తీరకుండా కొత్త రుణం ఇవ్వడంపై విచారణ జరుపుతున్నాం. మునెమ్మ రుణం తీర్చినట్లుగా ఏదైనా ఆధారాలు తీసుకొస్తే న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

- విజయ్, కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి -కోట : కోట మండలం గూడలి గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ప్రాంగణంలో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి హైమావతమ్మ దంపతులు వారి కుమారుడు, కుమార్తె మధుకిరణ్ రెడ్డి, లావణ్య సౌజన్యంతో కల్యాణ మహోత్సవం చేపట్టారు. కల్యాణ మహోత్సవంలో బుల్లయ్య, వెంకట లక్ష్మమ్మ , గుంటి రాఘవ, అమల, ఆములూరు నాగార్జున, శ్రీవల్లి, దేవా, జగదీష్, నివాస్, నాగేంద్ర పాల్గొన్నారు.

సంఘ సభ్యురాలికి అండగా ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: దీందారపల్లిలోని గ్రామసమైక్య-2 నాగూర్ షరీఫ్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు ఆఫ్రిన్ భర్త మహమ్మద్ రఫీ గత నెల 16న రోడ్డుప్రమాదంలో చనిపోయారు. ఆమెకు మహమ్మద్ ఇబ్రహీం(2), మహమ్మద్ ఆఫ్రిద్(3నెలలు) పిల్లలు ఉన్నారు. దీంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు వీవో-2 సంఘ సభ్యులు రూ.23,500 సమకూర్చి ఆమెకు అందించారు. ఇందులో ఏపీఎం కుమార్, సీసీ సురేంద్ర సైతం సాయం చేశారు. కష్ట పరిస్థితిలో తోటి సభ్యులు ఆర్థిక సహాయం చేయడం చాలా గొప్ప విషయమని ఏపీఎం కుమార్ అన్నారు. ఎస్.అఫ్రన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటీఎస్ ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద పుత్తూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం లబ్ధిదారులకు పట్టాలు అందించారు. తడుకు, నేసనూరు, గోపాలకష్ణాపురం, పరమేశ్వరమంగళం గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఓటీఎస్ పత్రాలను మంత్రి ఆర్కే రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి, ఎంపీపీ మునివేలు, ఎంపీడీవో, ఏవో వాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, కోఆప్షన్ మెంబర్ రామ్‌బత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురి చేరిక

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరులో పలువురు యువకులు బుధవారం జనసేన పార్టీ లో ఆ పార్టీ నాయకుడు గోపి రాయల్ సమక్షంలో చేరారు. యువత జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సేవ చేస్తామని వస్తున్నారని తెలిపారు. ఎన్ సాయికుమార్, ఉదయ్ కిరణ్, ఢిల్లీ కుమార్, కిరణ్, వెంకటస్వామి జనసేన పార్టీలో చేరడం అభినందనీయమని తెలిపారు.

గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలపై ప్రచారం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ బడులపై ప్రచారం చేపట్టారు. బుధవారం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ప్రసాద్ కురుంజలం, తలారివెట్టు హరిజనవాడ గ్రామాల్లో తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కల్లివెట్టు పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు.

రోడ్డుపై తొలగిన మురుగు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 'రోడ్లపైనే మురుగు' అన్న శీర్షికతో మంగళవారం ప్రచురితమైన వార్తా కథనానికి మంగళం పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుపై వెళుతున్న మురుగునీరును జెసిబి సహాయంతో పూడిక తీయించి క్రమబద్ధీకరించారు. త్వరలోనే కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. మురుగునీటిని తొలగించేందుకు సహకరించిన ప్రజాశక్తికి స్థానికులు కతజ్ఞతలు తెలిపారు.

గంగజాతరకు రాజకీయాలు ఆపాదిస్తారా?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, ఆలయ పాలకమండలి ప్రభుత్వ విభాగాల సహాయ సహకారాలతో ఎన్నడూ లేని విధంగా ఘనంగా నిర్వహించిన జాతరకు రాజకీయాలను ఆపాదిస్తారా అంటూ విమర్శలపై ఆలయ ఛైర్మన్ కట్టా గోపియాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ చారిత్రక విశేషాలు కలిగిన తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించేలా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కృషి చేశారని, ఈ నేపథ్యంలో నిర్వహించిన గంగమ్మ జాతరపై ప్రతిపక్షాలు వక్రబుద్ధితో ఆలోచిస్తూ విమర్శలను చేయడం బాధాకరమన్నారు.

మృతుని కుటుంబానికి బీమా సాయం

ప్రజాశక్తి-కేవీబీపురం: అంజూరుపాలెంలో మృతి చెందిన అయ్యప్ప కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం భరోసా కల్పించారు. తక్షణ సాయంగా రూ.10 వేలు వైఎస్ఆర్ బీమా నగదును అందించారు. ఎంపీడీవో రామచంద్రయ్య, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ విద్యాలత, ప్రసాద్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాక్ పీర్ బందం రాక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు కళాశాల నాణ్యత ప్రమాణాలను పరిశీలించుటకు న్యాక్ పీర్ బందం వస్తుందని ఎస్.కె.ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల పరిశీలించి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా గ్రేడ్ ను కేటాయిస్తారని తెలిపారు.

తమ్ముడి ప్రాణాలను కాపాడండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతూ ప్రాణాలను నిలుపుకోవడానికి పోరాడుతున్న తన తమ్ముడు మడక వీరశేఖర్ ప్రాణాలను దాతలు విరాళాలు అందించి కాపాడాలని వీరశేఖర్ సోదరి లోకేశ్వరి విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లోకేశ్వరి మాట్లాడుతూ గత నెల 23న వీరశేఖర్ అతని భార్య తిరుచానూరులోని సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకుని తిరుగు ప్రయాణమై నూతనంగా ప్రారంభించిన శ్రీనివాస సేతుపై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో వీరశేఖర్ అతని భార్య తీవ్రంగా గాయపడ్డారని, అయితే వీరశేఖర్ భార్య కోలుకుంటోందని వీరశేఖర్ మాత్రం అపోలో ఆసుపత్రిలో గత 24 రోజులుగా ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వైద్యానికి ఇప్పటివరకు రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేశామని.. ఇంకా రూ.25 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారన్నారు. దాతలు విరాళాలు అందించి వీరశేఖర్ ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. ఆర్థిక సాయం అందజేయడానికి 8790767399ను సంప్రదించాలని కోరారు.

తరిగొండ వెంగమాంబ దాన పత్రాల పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-క్యాంపస్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ దానపత్రాలు పుస్తకాన్ని శ్రీపద్మావతి విశ్రాంతి గహంలో బుధవారం టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ సాయికష్ణ యాచేంద్ర, డాక్టర్ నాగోలు కష్ణారెడ్డి ఈ పుస్తకాన్ని రచించారు. శ్రీవెంగమాంబ కాలానికి సంబంధించిన 33 దాన శాసనాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. కార్యక్రమంలో జేఈవో లు సదాభార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

మేఘన డెంటల్ హాస్పిటల్‌తో ఒప్పందం



ప్రజాశక్తి-క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృతి విశ్వ విద్యాలయం ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ సంక్షేమ చర్యల్లో భాగంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి ఎస్ ఆర్ కష్ణమూర్తి, రిజిస్ట్రార్ చల్లా వెంకటేశ్వర్ తిరుపతిలోని మేఘన మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ అధికారులతో పరస్పర అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కష్ణమూర్తి మాట్లాడుతూ ఎం ఓ యు నిబంధనల ప్రకారం యూనివర్సిటీలోని సిబ్బంది ఆసుపత్రి నుండి నగదురహిత దంత సేవలను పొందవచ్చున్నారు. మేఘన డెంటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హేమాద్రి ఆధ్వర్యంలో ఈఎంఒయు కార్యక్రమాన్ని ఒప్పంద పత్రాలను మార్చుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఆర్ ఎల్ ఎస్ శాస్త్రి, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవి కృష్ణారావు, వైద్యాధికారి డాక్టర్ బి. బాల దత్తాత్రేయ, వర్సిటీ ఉద్యోగులు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య కిరణ్‌క్రాంత్ చౌదరికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు డా.డి కిరణ్ క్రాంత్ చౌదరి భారతీయ కళా చరిత్ర సమాఖ్యకు (ఇండియన్ ఆర్ట్ హిస్టరి కాంగ్రెస్) సర్వ అధ్యక్షునిగా ఎంపిక అయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ గౌరవాన్ని పొందిన తొలి వ్యక్తి డా.కిరణ్ క్రాంత్ చౌదరి. ఈ సంవత్సరం జనవరిలో అస్సాంలోని నల్బరీలో జరిగిన ఇండియన్ ఆర్ట్ హిస్టరి కాంగ్రెస్ కార్యవర్గ సర్వసభ్య సమావేశాలలో డా. కిరణ్ ని అధ్యక్షులుగా ఎంపిక చేసుకొన్నట్లు వీరికి ఆహ్వాన పత్రం అందింది. 24 ఫిబ్రవరి మధ్య ప్రదేశ్, అమర్ కంటక్ లోని ఇందిరా గాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్శిటీలో జరగబోయే 31వ వార్షిక సదస్సు సర్వ అధ్యక్షులుగా వ్యవరించనున్నారు. డా॥కిరణ్ శిల్ప, వాస్తు కళలలో పరిశోధనలతో దేశ, విదేశాలలో గుర్తింపు పొందారు. ఆహ్వానం మేరకు అనేక దేశాలలో శిల్పకళలపై ఉపన్యాసాలు ఇచ్చారు. వీరు గతంతో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, డీన్‌గా, ప్రిన్సిపల్ గా పరీక్షల విభాగ డీన్‌గా, ప్రత్యేక అధికారిగా పనిచేసి అందరి మన్ననలను అందుకొన్నారు. పరిశోధనా రంగంలో వందకు పై గా వ్యాసాలు, 16 గ్రంథాలను వెలువరించారు. ఈమధ్యన 'స్ప్లెండర్స్ ఆఫ్ విజయ నగర ఎంపైర్ :ఆర్కిటెక్చర్, ఆర్ట్స్, పెయింటింగ్స్ ' గ్రంథాన్ని వెలువరించారు. వీరు రాసిన "శివ ఇన్ ఇండియన్ ఆర్ట్ " కి బెరహంపూర్ యూనివర్సిటి డి.లిట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం వీరు ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్యకు సర్వ అధ్యక్షులుగా ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-కేవీబీపురం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం కేవీబీపురం మండలంలోని అంజూరుపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా ఆరా తీశారు. ఈ సందర్భంగా వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముని లక్ష్మీ నందకుమార్, రాష్ట్ర హిస్టరీ అకడమిక్ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, జడ్పిటిసి మూర్తి, మునెమ్మ, సుబ్బయ్య, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, సరస్వతి రమేష్ సర్పంచ్ గిరి ఎంపీటీసీ విద్యాలత, ఎంపీడీవో రామచంద్ర, ఎంఈఓ లక్ష్మీపతి, ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు జగనన్న భరోసా

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : హజ్ యాత్రికులకు సీఎం జగన్మోహన్ రెడ్డి అందించిన ఆర్థిక సహాయం మరువలేనిదని వైసీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ గన్నవరం నుండి హజ్ యాత్రకు వెళ్లనున్న 1814 మంది హాజీలకు నేరుగా వారి ఖాతాల్లో రూ.14,51,20,000 కోట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జమ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి గొప్ప నిర్ణయం తీసుకొని మరోసారి ముస్లింల పక్షపాతి అని నిరూపించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ పట్టణ అధ్యక్షుడు జహీర్, కార్యదర్శులు జమీర్, యస్దాని, యువత అధ్యక్షుడు బాబు, షాకీర్, గయాజ్, షరీఫ్, మున్నా, వాజిద్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పబ్లిసిటీకి గంగజాతర చేశారా?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అనాదిగా వచ్చిన ఆచారాలను పక్కనపెట్టి కొత్త ఒరవడిని సష్టిస్తున్నామంటూ వ్యక్తిగత పబ్లిసిటీ కోసం తిరుపతి గంగమ్మ జాతరను నిర్వహించారా అని టిడిపి తిరుపతి అసెంబ్లీ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ స్థానిక ఎమ్మెల్యేపై విమర్శించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో నైతికంగా ఎవరు ఎమ్మెల్యేగా గెలుపొందారో తిరుపతి ప్రజలతో పాటు సీఎం జగన్ మోహన్ రెడ్డికొలుసన్నారు. పోస్టల్ బ్యాలెట్ తారుమారుతో ఎమ్మెల్యేగా కొనసాగుతున్న భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతి ప్రజలు నమ్మడం లేదన్నారు. నూతనంగా నిర్మింపబడ్డ అమ్మవారి గర్భగుడికి జగన్ పేరు వచ్చేలా పుష్పాలంకరణ చేయడంతో వీరి పిచ్చి పరాకాష్టకు చేరిందని స్పష్టమవుతుందన్నారు. అమ్మవారికి భక్తి పూర్వకంగా సమర్పించే ఆర్థిక కానుకలతో జాతర మునుపు జరిగేదని, బలవంతపు వసూళ్లతో నేడు గంగ జాతరను ఎమ్మెల్యే నిర్వహించడం దుయ్యబట్టారు. తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ జాతరకు వ్యయ, ఆదాయ వివరాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ గంగమ్మ గుడి చైర్మన్ ఆర్ సి మునికృష్ణ, సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, మునిశేఖర్, మహేష్,మనోహరాచారి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని 16వ వార్డు సచివాలయాన్ని గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. పట్టణ పరిధిలో నిర్మించి ఉన్న టిడ్కో అపార్ట్మెంట్స్ కేటాయించేందుకు లబ్ధిదారులకు అవసరమైన బ్యాంకు లోన్ ప్రాసెస్ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న హౌసింగ్ కాలనీలో స్థలం పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుంటే వారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జామ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలికపై నాలుగు నెలలుగా అత్యాచారం

ఫోక్సో కేసు నమోదు.. నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: కామంతో కళ్లు మూసుకుపోయి చెల్లెలపైనే నాలుగు నెలలుగా అత్యాచారం చేసిన వరుసకు అన్న, కామాంధుడిపై ఫోక్సో కేసు నమోదు చేసిన సంఘటన వరదయ్యపాలెం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా.. సంతవేలూరు గ్రామానికి చెందిన బాలిక తండ్రి ఆటో నడుపుతుండగా.. తల్లి ఓ కంపెనీలో పని చేస్తోంది. ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసి ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై తన పెద్దనాన్న కుమారుడు, వరుసకు సొంత అన్న విక్రమ్‌రాజా బాలికను బెదిరించి నాలుగు నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఇదిలా ఉండగా బాలికకు గత కొన్ని రోజులుగా కడుపులో నొప్పి రావడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బాలికను ప్రశ్నించగా నాలుగు నెలలుగా అత్యాచారం చేసిన విషయం చెప్పడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నిందితుడు విక్రమ్‌రాజాపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. బాలికలపై లైంగికదాడి, అపహరణ, లైంగిక వేధింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- రేణిగుంట : పాపానాయుడుపేట మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. వికృతమాల సమీపంలోని ఎన్టీఆర్ నగర్‌లో కాపురం ఉంటున్న మునిసుందరి బుధవారం రేణిగుంట నుంచి లిఫ్ట్ అడిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కిందపడిన ముని సుందరిని వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు తొక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురు గాయపడ్డారు. గాజులమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో విశ్రాంత ఉద్యోగి ...

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరుకు చెందిన విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి గజేంద్ర బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి పలు యూనియన్ నాయకులు, కుల సంఘాలు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

త్వరలో ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీఎస్ఆర్టీసీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ త్వరలో పెన్షన్ సౌకర్యం కలగబోతోందని ఆ సంస్థ డైరెక్టర్ ఏ. రాజారెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామనీ, కారుణ్య నియామకాలతో పాటు రీఎంబర్స్మెంట్ చెల్లింపులు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. స్థానిక శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో గ్యారేజీని బుధవారం రాజారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో ముఖాముఖి సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2004 వరకు ఆర్టీసీ సంస్థ మునిగిపోయే నావలా ఉండేది అన్నారు. ఆర్టీసీ సంస్థ లాభాలను, బస్సులను, అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీ అవసరాలకు వినియోగించుకోవడం, ఆర్టీసీ నుంచి 15 నుంచి 25 రథం పన్ను రూపంలో వసూలు చేయడంతో దివాలా తీసేస్తాయికి చేరిందని వాపోయారు. అయితే 2005లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, పన్ను శాతాన్ని 7కు కుదించడం, రియంబర్స్మెంట్ చేయడం వల్ల ఆర్టీసీ సంస్థ తిరిగి జీవం పోసుకుందన్నారు. తిరిగి చంద్రబాబు సీఎం అయ్యాక ఆర్టీసీ పరిస్థితి మళ్లీ దివాలా తీసింది అన్నారు. ఈ క్రమంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా 51 వేల మంది ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం గొప్ప పరిణామన్నారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలు ఆర్టీసీ ఉద్యోగులకు అందుతాయన్నారు.ఆర్టీసీ పదివేల కోట్లు అప్పుల్లో ఉండగా, ప్రభుత్వంలో విలీనం అయ్యాక ఇప్పటివరకు 7000 కోట్లు అప్పులు తీర్చామని, మరో రెండు వేల కోట్లు చెల్లించాల్సి ఉందని అన్నారు.

ఆర్.ఓ.సి.నెం.1418/2023/ఎ1,

తిరుపతి నగరపాలక సంస్థ

బహిరంగ వేలము ప్రకటన

తిరుపతి నగర పాలక సంస్థకు చెందిన జి.ఎన్ మాడా వీధి మరియు జి.ఎస్. మాడా వీధి నందు పార్కింగ్ స్థలములను సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము నిర్వహించి వాపసు చేయని గుడ్ విల్ పద్ధతి పై స్వాధీనము చేసిన తేది నుండి ఒక సంవత్సరము కాలమునకు లీజుకు యిచ్చుటకు బహిరంగ వేలము తేది: 27-05-2023 న ఉదయం 11-00 గంటలకు కార్యాలయము నందు నిర్వహించబడును.

గమనిక : మిగిలిన వివరములు కొరకు నగర పాలక సంస్థ కార్యాలయము నందు పని వేళలో రెవిన్యూ విభాగము నుండి పొందవచ్చును.

కమీషనరు
నగరపాలక సంస్థ, తిరుపతి

In the Court of the Prl. Senior Civil Judge: Tirupati
O.E.P. No. 34 Of 2018
O.S.No.519 of 2012
Matluru Krishna Reddy... D.Hr.
Vs.
Peram Raghava Reddy ... J.Drs.,

NOTICE TO THE JUDGEMENT DEBTOR NO.5 THROUGH PAPER PUBLICATION

Address of Judgement Debtor No-5
K.Geetha, D/o. Late Peram Raghava Reddy, residing at D.No. 19-6-18/C, STV Nagar, Tirupati, Chittoor District.

Please take E.P. Notice that the above execution petition is posted to 28.06.2023 for your appearance and you have to appear before the said court on that day, either by yourself or through your advocate at about 10.30 A.M. or else you will be set exparte and the case will be proceeded in your absence.

Date of Hearing : 28.06.2023
M.VANI, B.Sc., L.L.B.,
Advocate,Tirupati, Cell: 9440353827

గూడూరు Prl జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 206 / 2022
Andhra Pragathi Grameena Bank,
Thikkavaram Branch,
Rep. by its Manager ......వాది
Vs
1. Papareddy Padmavathi and anothers
......ప్రతివాదులు
To
D3. Buduru Chengaiah, S/o Vulasalaiah,
Kalavakonda Village, Chillakuru Mandal,
Tirupati District.
పై నెంబరులోని వాది తన లోను బాకీ రాబట్టుకొను నిమిత్తం పై దావా దాఖలు చేసినందున 3వ ప్రతివాది నోటీసుకు గాను తేది. 18-07-2023న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై 3వ ప్రతివాదికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకోవలసినది. లేనియెడల ఎక్సీపార్టీగా తీర్మానించబడును.
ఇట్లు,
టి. రఘురామిరెడ్డి,
వాది తరపున న్యాయవాది, గూడూరు.

గూడూరు Prl జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 382 / 2021
Canara Bank, Gudur
(Erstwhile Syndicate Bank)
Rep. by its Manager ......వాది
Vs
1. Kadimpati Sravani and anothers
......ప్రతివాదులు
To
D1. Kadimpati Sravani, W/o Babu,
203-1, Nayadu Kaluva Katta,
East Gudur, Gudur Town, Tirupati District.
పై నెంబరులోని వాది తన లోను బాకీ రాబట్టుకొను నిమిత్తం పై దావా దాఖలు చేసినందున 1వ ప్రతివాది నోటీసుకు గాను తేది. 16-06-2023న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై 1వ ప్రతివాదికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకోవలసినది. లేనియెడల ఎక్సీపార్టీగా తీర్మానించబడును.
ఇట్లు,
టి. రఘురామిరెడ్డి,
వాది తరపున న్యాయవాది, గూడూరు.